


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
26-05-2025
పేజీలు: 02



## ఐపీఎల్‌లో నేడు



పంజాబ్ VS ముంబై
జైపూర్,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్‌స్టార్‌లో..

# రెండో సెంచరీతో గర్జించిన క్లాసెన్



ఐపీఎల్ 18వ సీజన్ చివరి లీగ్ మ్యాచ్‌లో హెన్రిచ్ క్లాసెన్(105 నాటౌట్) సెంచరీతో గర్జించాడు. ఢిల్లీ మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తూ వీరోచిత శతకంతో విరుచుకుపడ్డాడీ చిచ్చరపిడుగు. ఓపెనర్ ట్రావిస్ హెడ్(76) సూపర్ హాఫ్ సెంచరీతో గట్టి పునాది వేయగా.. క్లాసెన్ తన మార్క్ విధ్వంసంతో కోల్‌కతా స్పిన్నర్లకు చుక్కలు చూపించాడు. ఇషాన్ కిషన్(29)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ పవర్ హిట్టర్ స్కోర్ 200 దాటించాడు. ఆఖర్లో అనికేత్ వర్మ(12 నాటౌట్) మెరుపులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 3 వికెట్ల నష్టానికికే 278 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో రికార్డులు బద్ధలు కొట్టాలన్నా.. అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించాలన్నా అది సన్‌రైజర్స్‌కే సాధ్యం. అవును.. ఈ సీజన్ ఆరంభ పోరులోనే 286 కొట్టిన ఆరెంజ్ ఆర్మీ.. చివరిదైన లీగ్ మ్యాచ్‌లోనూ భారీ స్కోర్ చేసింది. ట్రావిస్ హెడ్ (76) మెరుపు అర్ధ శతకానికి తోడూ.. హెన్రిచ్ క్లాసెన్(105 నాటౌట్) కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఊచకోత కోయగా సన్‌రైజర్స్ 278 రన్స్ చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ(32), ట్రావిస్ హెడ్(76)లు ఎప్పటిలానే శుభారంభం ఇచ్చారు. కోల్‌కతా బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొంటూ స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించారు. దాంతో, పవర్ ప్లేలోనే స్కోర్ చేరింది. దంచికొడుతున్న ఈ జోడీని సునీల్ నరైన్ విడదీశాడు. పెద్ద షాట్‌కు యత్నించిన అభిషేక్ .. బౌండరీ లైన్ వద్ద రింకూకు దొరికాడు. దాంతో, 92 వద్ద తొలి వికెట్ పడింది. కాసేపటికే హెడ్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు.ఆ తర్వాత దంచుడు మొదలు పెట్టిన హెన్రిచ్ క్లాసెన్(105 నాటౌట్ 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లు) శివ తాండవం చేశాడు. కోల్‌కతా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని లక్ష్యంగా చేసుకున్న క్లాసెన్ అతడు వేసిన 10వ ఓవర్లో 3 ఫోర్లు బాదాడు. ఆ తర్వాత రస్సెల్ ఓవర్లో బౌండరీ కొట్టిన ఈ చిచ్చరపిడుగు హర్షిత్ రానా ఓవర్లో వరుసగా 4, 6, 6 ద్వారా 17 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్ ఔటైనా సన్‌రైజర్స్ స్కోర్ వేగం మాత్రం తగ్గలేదు.

### ఐపీఎల్‌లో టాప్ 4 అత్యధిక మొత్తాలు అన్నీ సన్‌రైజర్స్‌కి చెందినవే

287/3 - సన్‌రైజర్స్ v ఆర్సీబీ, 2024
286/6 - సన్‌రైజర్స్ v రాజస్తాన్, 2025
277/3 - సన్‌రైజర్స్ v ముంబై, 2024
278/3 - సన్‌రైజర్స్ v కొల్‌కత్తా, 2025
272/7 - కొల్‌కత్తా v ఢిల్లీ, 2024
టాప్ 5 లో 4 సన్‌రైజర్స్ విజయాలు..




## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్(Q) | 14 | 9 | 5 | 18 |
| పంజాబ్ (Q) | 13 | 8 | 4 | 17 |
| ఆర్సీబీ (Q) | 13 | 8 | 4 | 17 |
| ముంబై (Q) | 13 | 8 | 4 | 16 |
| ఢిల్లీ (E) | 14 | 6 | 6 | 15 |
| సన్‌రైజర్స్(E) | 14 | 6 | 7 | 13 |
| లక్నో (E) | 13 | 6 | 7 | 12 |
| కొల్‌కత్తా (E) | 14 | 5 | 7 | 12 |
| రాజస్తాన్ (E) | 14 | 4 | 10 | 8 |
| చెన్నై (E) | 14 | 4 | 10 | 8 |




ఆరెంజ్ క్యాప్
679
ఐపీఎల్ అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
24
ఐపీఎల్ అత్యధిక వికెట్స్

# ఇంస్టాగ్రామ్‌లో పరిచయం.. 40 ఏళ్ల ఆంటీని పెళ్లి చేసుకున్న 25 ఏళ్ల యువకుడు



టిపిన్ వేస్ట్ చేస్తుందని యువకుడు మందలించడంతో ఉరేసుకొని ఆంటీ ఆత్మహత్య.. భయపడి విషం తాగి యువకుడు సూసైడ్. విశాఖపట్నానికి చెందిన పద్మ(40) అనే వివాహితకు ఒక భర్త, మెడికల్ రెప్రజెంటేటివ్ గా పని చేసే ఒక కొడుకు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక కూతురు ఉన్నారు. పద్మకు ఇంస్టాగ్రామ్‌లో శ్రీకాళహస్తికి చెందిన సురేష్(25)తో పరిచయం ఏర్పడింది.. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి పద్మ, సురేష్ కోసం శ్రీకాళహస్తికి వెళ్ళింది. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి పద్మను తిరిగి ఇంటికి తీసుకురాగా.. 9 నెలల క్రితం మళ్ళీ వెళ్ళి సురేష్‌ను పెళ్లి చేసుకుంది. పెళ్లయ్యాక ఇద్దరు కైలాసగిరి కాలనీలో వేరే కాపురం పెట్టారు. పెళ్లైన దగ్గర నుండి ఇద్దరు మధ్యలో గొడవలు రాగా.. టిఫిన్, భోజనం వేస్ట్ చేస్తున్నవంటూ సురేష్, పద్మను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పద్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.. ఉరేసుకున్న పద్మను కిందికి దించిన సురేష్ భయపడి ఎవరికి చెప్పకుండా అలానే ఇంట్లోనే ఉన్నాడు. చివరికి సురేష్ పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు.. ఇంట్లో నుండి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు . కోన ఊపిరితో ఉన్న సురేష్‌ను పోలీసులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశాడు.



# నేటితో ముగియనున్న సరస్వతి పుష్కరాలు

కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలు ముగియనున్నాయి. సోమవారం, చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. దీపాలు వెలిగించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. కాగా సోమవారం రాత్రి 7:45 గంటలకు నవరత్నమాల హారతితో పుష్కరాలు ముగియనున్నాయి. పుష్కరాల ముగింపు సందర్భంగా వీఐపీ ఘాట్ వద్ద ఇవాళ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సాయంత్రి 6 గంటల నుంచి వేద స్వస్తి కార్యక్రమం, బ్రహ్మశ్రీ నాగ ఫణిశర్మ సందేశం, మంత్రుల ప్రసంగాలు ఉంటాయని అధికారులు తెలిపారు. రాత్రి 7.46 నుంచి 7.54 వరకు డ్రోన్ షో నిర్వహించనున్నారు. పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



# పుతిన్‌పై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

తాను అధికారంలోకి వస్తే ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ఆపేస్తానంటూ ఎన్నికల సమయంలో డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. హామీ ఇచ్చినట్టుగానే ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, తాజాగా, రష్యా వైమానిక దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ఖండించారు. పుతిన్ పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడని, ఉక్రెయిన్‌ను ఆక్రమిస్తే రష్యా పతనమవుతుందని హెచ్చరించారు. శాంతి చర్చల సమయంలో రష్యా వైఖరిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీ మాట్లాడుతున్న తీరు సరిగా లేదని విమర్శించారు. రష్యా దాడుల నేపథ్యంలో మరిన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు.మూడేళ్లకుపైగా కొనసాగుతోన్న ఉక్రెయిన్, రష్యా యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం దిశగా శాంతి చర్చలు సాగుతోన్న వేళ.. ఉక్రెయిన్‌పై రష్యా భారీ వైమానిక దాడికి తెగబడింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. రష్యా వైమానిక దాడికి ఖండించిన ఆయన.. పుతిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు. ఉక్రెయిన్‌ను పూర్తిగా ఆక్రమించాలనుకుంటే అది రష్యా పతనానికి దారితీస్తుందని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు. ఉక్రెయిన్‌పై దండయాత్ర మొదలైన తర్వాత రష్యా జరిపిన అతిపెద్ద వైమానిక దాడి ఇదే కావడంతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పుతిన్‌తో నాకు మంచి సంబంధాలే ఉన్నాయి.. కానీ, అతడు పూర్తిగా పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడు... అకారణంగా చాలా మందిని చంపుతున్నాడు. కేవలం సైనికులే కాదు, సాధారణ పౌరులూ చనిపోతున్నారు.. నగరాలపై క్షిపణులు, డ్రోన్లు దాడి చేస్తున్నాయి' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. 'అతడికి ఉక్రెయిన్ పూర్తిగా కావాలని నేను ముందే చెప్పాను.. ఇప్పుడది నిజం అవుతోంది. కానీ, అలాంటి ప్రయత్నం చేస్తే అది రష్యా పతనానికి దారితీస్తుంది' అని ట్రంప్ హెచ్చరికలు చేశారు. గతంలో పుతిన్‌పై పట్ల సానుకూలంగా ఉన్నప్పటికీ.. ఇటీవల జరుపుతోన్న శాంతి చర్చల్లో కీవ్‌తో మాస్కో అనుసరిస్తున్న వైఖరిపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. రష్యా ఇటీవల ఉక్రెయిన్‌పై చేపట్టిన భారీ డ్రోన్ దాడుల్లో 13 మంది చనిపోయారు.


### జెలెన్‌స్కీపై విమర్శలు

'పుతిన్ ఏం చేస్తున్నాడో నాకు అర్థం కావడం లేదు. చాలా మంది చనిపోతున్నారు. చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాడు' అని ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీపై కూడా విమర్శలు గుప్పించారు. అతడు మట్లాడే విధానమే సమస్యలకు కారణమవుతోందని, అది తనకు నచ్చడం లేదని ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నేను అధ్యక్షుడిగా ఉండుంటే ఈ యుద్ధం మొదలయ్యే అవకాశం లేదని ఎన్నిసార్లు చెప్పానో! ఇది జెలెన్‌స్కీ.. పుతిన్, బైడెన్‌ల యుద్ధం.. ట్రంప్‌ది కాదు. నేను చేసే పని ఈ పెద్ద ప్రమాదాన్ని ఆపడమే. అసమర్థత, ద్వేషం వల్ల ఇది జరిగిందని నేను చెప్పింది నిజం' అని పేర్కొన్నారు.

### రష్యా దాడులు.. పరిణామాలు

రష్యా-ఉక్రెయిన్‌లు వందల సంఖ్యలో ఖైదీలను పరస్పర మార్పిడి జరిగిన తర్వాత.. మాస్కో మళ్లీ తీవ్ర వైమానిక దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో ఇద్దరు చిన్నారులు, యువకుడు సహా పలు ప్రాంతాల్లో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. రష్యా చర్యలపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. 'రష్యా నాయకత్వంపై గట్టి ఒత్తిడి లేకుండా ఈ మానవహననం ఆగదని అన్నారు.

# కేతిక హాట్



అందాల ముద్దుగుమ్మ కేతిక శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తాజగా ఈ బ్యూటీ లేత గులాబీ రంగు చీరలో తన అందాలతో కుర్రకారును మాయ చేస్తోంది. కొంటె చూపు చూస్తూ.. కుర్రకారును ఆగం చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి.సిగ్గు పడుతూ.. కొంటె చూపు చూస్తు ఉన్న ఈ ఫొటోస్ నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి. పాలబుగ్గల లాంటి సోయగంతో.. అచ్చం అప్సరనేనా అనిపించేలా ఈ బ్యూటీ ఫొటోలకు ఫోజులిచ్చింది. వీటిని తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇవి నెట్టింట సందడి చేస్తున్నాయి.

# వీడ్కోలుపై 4 నెలల్లో నిర్ణయం



ఐపీఎల్ 18వ సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ విజయంతో ముగించింది. లీగ్ దశ చివరి పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్‌కు మహేంద్ర సింగ్ ధోనీ సేన చెక్ పెట్టింది. అయితే.. ఇప్పుడు అందరి మెదళ్లలో తాలా మరో సీజన్ ఆడతాడా ? అనే ప్రశ్నే ఉత్పన్నమవుతోంది. రెగ్యులర్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయంతో తప్పుకోగా.. మళ్లీ పగ్గాలు అందుకున్న మహీ వీడ్కోలుపై మరో నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. అంతేకాదు వచ్చే సీజన్‌కు కెప్టెన్ ఎవరు ? అనే విషయంపై కూడా స్పందించాడీ లెజెండ్. గుజరాత్‌పై గెలుపు అనంతరం ధోనీ మాట్లాడుతూ మాట్లాడుతూ సీఎస్కే భవితవ్యం.. వీడ్కోలు విషయాలపై గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ సీజన్ మాకు అనుకూలంచలేదు.

# పంజాబ్ వర్సెస్ ముంబై




ఐపీఎల్ 2025లో ఈ రోజు హై ఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఆఖరి బంతి వరకూ ఐపీఎల్ ఫ్యాన్స్ ఫుల్ ఫీస్ట్ గ్యారెంటీ అని చెప్పొచ్చు. క్వాలిఫైయర్స్ 1లో ఆడేందుకు ఇదే మంచి ఛాన్స్ కావడంతో తాడో పేడో తేల్చుకోవడానికి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ సిద్ధమయ్యాయి.ఐపీఎల్‌లో ఈ రోజు 69వ మ్యాచ్ జరగనుంది. జైపూర్‌లోని స్వామీ మాన్‌సింగ్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు తలపడనున్నాయి. రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ లైవ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్‌లో వీక్షించొచ్చు.కొత్త సారథి, కొత్త కోచ్ నేతృత్వంలో పంజాబ్ కింగ్స్ నమ్మలేని విజయాలతో దూసుకుపోతోంది. పదేళ్ల తర్వాత ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టిన పంజాబ్ కింగ్స్.. ఇప్పుడు క్వాలిఫైయర్స్ 1లో ఆడేందుకు తహతహలాడుతోంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో స్ట్రాంగ్‌గా ఉన్న పంజాబ్ ఇప్పటి వరకు 13 మ్యాచ్‌లు ఆడి ఎనిమిది గెలిచి, నాలుగు ఓడింది. ఒకదాంట్లో ఫలితం తేలలేదు. ఓవరాల్‌గా 17 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.కనీసం ఐదు మ్యాచ్‌లు అయినా గెలుస్తుందా ? అనుకున్న ముంబై ఇండియన్స్ సడెన్‌గా కమ్ బ్యాక్ ఇచ్చి వరుస విజయాలతో ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టి అందర్నీ ఆశ్చర్యపరిచింది. డూ ఆర్ డై మ్యాచ్‌లో ఢిల్లీని మట్టికరిపించి ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టిన ముంబై.. ఇప్పుడు పంజాబ్‌తో ఢీ కొట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫైయర్స్‌లో అడుగుపెట్టడమే కాకుండా ఆరోసారి టైటిల్ అందుకోవాలని ముంబై చూస్తోంది.



నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM

# ఇండియా కంటే వెనకబడ్డ జపాన్



భారత్ జపాన్‌ను అధిగమించింది. నామినల్ జీడీపీ పరంగా ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. ఇది భారతీయులందరూ సంతోషించదగ్గ విషయం. అయితే, ఈ అంశానికి మరో కోణం కూడా ఉందని వెల్త్ అడ్వైజర్ హర్షల్ భట్టే లింక్డ్ఇన్‌లో రాసుకొచ్చారు. వ్యవస్థాగత లోపాలు జపాన్ వెనుకబాటుకు ప్రధాన కారణమని అన్నారు. 2010లో జపాన్ ఆర్థిక వ్యవస్థ విలువ 6 ట్రిలియన్ డాలర్లుగా ఉండేది. కానీ నేడు అది కేవలం 4.2 ట్రిలియన్ డాలర్లకు కుంచించుకుపోయింది. మరోవైపు, భారత ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో రెండింతలై 4 ట్రిలియన్ మార్కు దాటింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి లెక్కల ప్రకారం, ఈ ఏడాది భారత వృద్ధి రేటు 6.2 శాతం నుంచి 6.5 శాతం వరకూ ఉండే అవకాశం ఉంది. వినియోగంలో వృద్ధి, మౌలిక వసతులపై పెట్టుబడులు పెరగడం వంటివి ఆర్థికాభివృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి. అంతర్జాతీయ పెట్టుబడుల రాక పెరుగుతుండటంతో పాటు తలసరి ఆదాయం కూడా గత పదేళ్లల్లో రెట్టింపైంది. అయితే, భారత్ పూర్తిస్థాయిలో తన సామర్థ్యాలను వినియోగించుకోవట్లేదని భట్టే అభిప్రాయపడ్డారు. గతంలో జపాన్, చైనా వలెనే వరుసగా భారత్ కొన్ని సంవత్సరాల పాటు 8 శాతానికి పైగా వార్షిక వృద్ధి రేటు సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్‌లో ప్రస్తుతం మౌలిక వసతులపై పెట్టుబడి 24 శాతంగా ఉందని, ఇది 32 శాతానికి పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. గొప్ప వృద్ధి రేటు సాధించాలంటే మౌలిక వసతులపై పెట్టుబడులు భారీగా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడే, దేశ ప్రజలను పేదరికం నుంచే బయటపడేయడం సాధ్యమవుతుందని అన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ఇక జపాన్ వెనకబడటానికి ప్రధాన కారణం వృద్ధుల జనాభా పెరగడమేనని భట్టే తెలిపారు. జపాన్ జనాభాలో 65 ఏళ్లకు పైబడిన వారి వాటా 30 శాతం. దీంతో, అక్కడ కార్మికుల కొరత ఎక్కువైంది. వినియోగం, ఉత్పాదకత తగ్గాయి. వృద్ధులకు పెన్షన్లు, వైద్య ఖర్చులు భారంగా మారాయి. అంతిమంగా ఈ వ్యవస్థాగత లోపాలు జపాన్‌కు గుదిబండగా మారాయి.

# టెస్టు జట్టులో అయ్యర్‌కి దక్కని చోటు



ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు బీసీసీఐ టీమిండియా స్క్వాడ్‌ను ప్రకటించింది. టీమిండియా జట్టు ప్రకటించినప్పటి నుంచి సెలక్టర్లపై ఫ్యాన్స్, మాజీలు అసహనంగానే ఉన్నారు. ముఖ్యంగా శ్రేయాస్ అయ్యర్‌ని ఎందుకు సెలక్ట్ చేయలేదు అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఐపీఎల్ 2025లో శ్రేయాస్ అద్భుతంగా ప్రదర్శన చేశాడు. ముఖ్యంగా మిడిలార్డర్‌లో జట్టుకు బలంగా మారాడు. అలాంటి ప్లేయర్‌ని సెలక్ట్ చేయకపోవడంతో విమర్శలు వచ్చాయి. శ్రేయాస్ అయ్యర్ విషయంలో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెదవి విరిచాడు. అసలు శ్రేయాస్ అయ్యర్‌ని ఎందుకు సెలక్ట్ చేయలేదంటూ ప్రశ్నిస్తున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న ప్లేయర్‌ని సెలక్ట్ చేయకపోవడం అది జట్టును కూడా బలహీనపరుస్తుందన్నాడు. జట్టు ఒత్తిడిలో ఉన్నప్పుడు శ్రేయాస్ అయ్యర్ చాలా జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్తాడని చెప్పాడు. అతను మూడు ఫార్మాట్లు ఆడలేడని అనుకుంటున్నారా? అంటూ సెహ్వాగ్ ప్రశ్నించాడు. "ఐపీఎల్‌లో రిషబ్ పంత్ అంత అద్భుతంగా ఏమీ కెప్టెన్సీ చేయలేదు. కానీ శ్రేయాస్ అయ్యర్‌కి ఇది గ్రేట్ సీజన్. మరి అలాంటప్పుడు శ్రేయాస్ టెస్ట్ క్రికెట్ ఎందుకు ఆడలేడు? అతను కచ్చితంగా మూడు ఫార్మాట్లలో ఆడగలడు. అతను మంచి ఫామ్‌లో ఉన్నాడు.. అలాంటప్పుడు అతన్ని ఇంగ్లండ్ టూర్‌లో ఆడించాల్సింది. నేనయితే అతన్ని టెస్టు క్రికెట్‌లో చూడాలని అనుకుంటున్నాను.

# సర్దార్ డబుల్ ఇంపాక్ట్

అగ్ర హీరో కార్తీ 'సర్దార్' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో భారీ విజయాన్ని సాధించిన విషయం విదితమే. ఈ సినిమా సీక్వెల్‌గా 'సర్దార్ 2' సినిమా ప్రస్తుతం తెరకెక్కుతున్నది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ 'సర్దార్2'కి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయ్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తున్న ఈ సినిమాకు నిర్మాత ఎస్. లక్ష్మణ్. కార్తీ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.కార్తీ మ్యాసీవ్ మిషిన్ గన్ పట్టుకొని రగ్గడ్ లుక్‌తో ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. కార్తీ పాత్ర ఈ సినిమాలో ఎంత శక్తివంతంగా ఉంటుందో ఈ పోస్టర్ చెబుతున్నది. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి. విలియమ్స్, సంగీతం: యువన్ శంకర్‌రాజా, సహనిర్మాత: ఎ.వెంకటేష్, నిర్మాణం: ప్రిన్స్ పిక్చర్స్.






# 16 ఏళ్ల తర్వాత తండ్రి కోసం..

విశ్వ నటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'థగ్ లైఫ్'. లెజండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రంలో శింబు, త్రిష, కృష్ణన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ లో భాగంగా చెన్నైలో గ్రాండ్ గా ఆడియో రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రుతి హాసన్ లైవ్ పెర్ఫామెన్స్ చేసింది. కమల్ హాసన్ కూతురుగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన శ్రుతి హాసన్.. హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. కెరీర్ ప్రారంభంలో వరుస ఫ్లాపులతో ఐరన్ లెగ్ అనే ముద్ర పడినటప్పటికీ, ఆ తర్వాత బ్లాక్ బస్టర్ విజయాలతో సౌత్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా మారిపోయింది. శ్రుతి మల్టీ టాలెంటెడ్ అనే సంగతి తెలిసిందే. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు వీలు చిక్కినప్పుడల్లా మ్యూజిక్ వీడియోలు చేస్తుంది. స్వయంగా మ్యూజిక్ కంపోజ్ చేయడమే కాదు, పాట పాడి సంగీత ప్రియులను అలరిస్తుంది. ఇప్పుడు లేటెస్టుగా 'థగ్ లైఫ్' మూవీ కోసం శ్రుతి ఓ సాంగ్ పాడింది.

# మహారాష్ట్రలో కొత్తగా 43 కోవిడ్ కేసులు



ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ 19 కేసులు మరోసారి ప్రబలుతున్న వేళ, తాజాగా ఇండియాలోని మహారాష్ట్రలో కూడా ఈ కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గత 24 గంటల్లో రాష్ట్రంలో 43 కొత్త కరోనా కేసులు (COVID 19 Cases) నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 209కి చేరింది. ఆరోగ్య శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం పూణేలో అత్యధికంగా 35 కేసులు నమోదు కాగా, ముంబైలో 8 కొత్త కేసులు రికార్డయ్యాయి. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, జనవరి నుంచి మహారాష్ట్రలో మొత్తం 300 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో జనవరిలో 1 కేసు, ఫిబ్రవరిలో 1, మార్చిలో 0, ఏప్రిల్‌లో 4 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా మే నెలలో 242 కేసులు నమోదయ్యాయి. అంటే, మొత్తం ఇన్ఫెక్షన్ కేసులలో 80 శాతం మే నెలలోనే నమోదయ్యాయి.

ముంబైలో అత్యధిక కేసులు

ఇప్పటివరకు నమోదైన 300 కేసుల్లో 248 ముంబై నుంచే నమోదయ్యాయి. మొత్తం కేసుల్లో ఇవి 82.67%. దీన్ని బట్టి చూస్తే ముంబై మరోసారి కరోనా కేంద్రంగా మారుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా కారణంగా నాలుగు మరణాలు మాత్రమే నమోదయ్యాయి. గత 24 గంటల్లో కొత్త మరణం సంభవించలేదు. ఈ క్రమంలో చికిత్స తర్వాత పూర్తిగా కోలుకున్న 87 మంది రోగులు తమ ఇళ్లకు తిరిగి వచ్చారు. కోవిడ్ సంక్రమణను నివారించడానికి ఆరోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది. దీంతోపాటు ప్రజలు కూడా మాస్క్ ధరించి జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య శాఖ సూచనలు జారీ చేసింది.

కరోనా వ్యాపిస్తున్న నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలు

రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎల్లప్పుడూ మాస్క్‌ను ధరించడం, ముఖ్యంగా మీకు అనారోగ్యంగా అనిపిస్తే


తరచుగా సబ్బుతో చేతులు కడుక్కోవడం లేదా శానిటైజర్ వాడటం కొనసాగించండి

మీకు జ్వరం లేదా జలుబు, ఒంటి నొప్పుల వంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే పరీక్షలు చేయించుకుని కోవిడ్ గురించి నిర్ధారించుకోండి

వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి.

# కంచిలో వితిక, కామాఖ్య గుడిలో ఐశ్వర్య రాజేష్

సోషల్ మీడియాలో తారలు ఎక్కువగా వెకేషన్స్ ఫోటోలు షేర్ చేస్తుంటారు. మాల్దీవులు, బాలీ, దుబాయ్ అంటూ ఇలా వెకేషన్లకు వెళ్లిన ఫోటోలను షేర్ చేస్తుంటారు. కానీ ఈ మధ్య మన తారలు మాత్రం ఎక్కువగా స్పిరిట్యువల్ మూడ్‌లోకి వెళ్లిపోతోన్నారు. తాజాగా వరుణ్ సందేశ్, వితిక అయితే కంచిని సందర్శించారు. ఇక ఐశ్వర్య రాజేష్ తన స్నేహితులతో కలిసి కామాఖ్య టెంపుల్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు.







# ప్రశాంత్ నీల్ సినిమాలో శ్రద్ధాకపూర్!

వైవిధ్యమైన కథా చిత్రాలతో బాలీవుడ్‌లో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును తెచ్చుకుంది శ్రద్ధాకపూర్. 'సాహో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలైందీ భామ. తాజా సమాచారం ప్రకారం ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ కాంబోలో రూపొందుతున్న 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో శ్రద్ధాకపూర్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలిసింది. ఇటీవలే ఈ సినిమా షూట్‌లో ఎన్టీఆర్ జాయిన్ అయ్యారు. ఆయన్ని మునుపెన్నడూ చూడని విధంగా అత్యంత శక్తివంతమైన పాత్రలో ఆవిష్కరిస్తూ దర్శకుడు ప్రశాంత్‌నీల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు. ఈ సినిమా ద్వితీయార్ధంలో వచ్చే కీలకమైన పాత్ర కోసం చిత్ర బృందం శ్రద్ధాకపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. తక్కువ నిడివి కలిగిన అతిథి పాత్రే అయినా కథను మలుపుతిప్పే విధంగా ఉంటుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రవిబస్రూర్ స్వరకర్త. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# సంగీత ప్రయాణంలో కుబేర




సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో ధనుష్, నాగార్జునల 'కుబేర' సినిమా ఒకటి. టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ని కూడా మేకర్స్ వేగవంతం చేశారు. రీసెంట్‌గా ఈ సినిమాకు చెందిన సెకండ్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' పేరుతో ఉన్న ఈ వీడియో ప్రేక్షకుల్ని కుబేర ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, సినిమాలోని కీలక పాత్రలనూ, అవి క్రియేట్ చేయబోయే తుఫాన్‌లనూ ఈ గ్లింప్స్ ప్రజెంట్ చేస్తుందని మేకర్స్ తెలిపారు. దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ ఈ గ్లింప్స్‌లో హైలైట్‌గా నిలిచింది. 'నాది నాది నాది నాదే ఈ లోకం..' అనే కోరస్ శ్రోతల్ని ఆకట్టుకునేలా ఉంది. నందకిశోర్ రచించిన ఈ పాటను ధనుష్, హేమచంద్ర వేదాల కలిసి ఆలపించారు. నాగార్జున ఇందులో ఉద్వేగపూరితమైన నటనతో ఆకట్టుకుంటారని, విలువలతో నడుచుకునే వ్యక్తిగా కనిపించినా, ఆయన పాత్రలో అంతులేని ఎన్నో ప్రశ్నలుంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఇక ధనుష్ ఇంటెన్స్ పెర్‌ఫార్మెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని వారు తెలిపారు. రష్మిక మందన్న, జిమ్ సర్భ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# భారీ లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు



వారంలో మొదటి ట్రేడింగ్ సెషన్ అయిన సోమవారం (మే 26న) భారత స్టాక్ మార్కెట్లు బలంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో సూచీలు మొత్తం గ్రీన్‌లోనే కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం 10.10 గంటలకు బీఎస్ఈ సెన్సెక్స్ 678 పాయింట్లకు పైగా పెరిగి 82,405.95 స్థాయికి చేరుకోగా, నిఫ్టీ 50 కూడా 202 పాయింట్లు లాభపడి 25,055కి చేరుకుంది. మరోవైపు బ్యాంక్ నిఫ్టీ 354 పాయింట్లు వృద్ధి చెందగా, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 414 పాయింట్లు పెరిగింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కొన్ని నిమిషాల వ్యవధిలోనే భారీ లాభాల దిశగా దూసుకెళ్లగా, ఇన్వెస్టర్లు లక్షల కోట్ల రూపాయలను దక్కించుకున్నారు. ఇదే సమయంలో హిందాల్కో, టాటా మోటార్స్, M&M, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉండగా, ఎటర్నల్, భారత్ ఎలెక్ట్రిక్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్బీఐ లైఫ్ ఇన్సురెన్స్, ట్రెంట్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉన్నాయి. ఇండెక్స్‌లో అధిక ప్రాధాన్యత కలిగిన ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది. అలాగే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరోపియన్ యూనియన్ నుంచి దిగుమతులపై 50% సుంకాన్ని జూలై 9 వరకు వాయిదా వేశారు. ఇది మార్కెట్ సెంటిమెంట్లపై సానుకూల ప్రభావాన్ని చూపిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.